
ప్రజాశక్తి
శుక్రవారం 13 డిసెంబర్ 2024



నేడు సీనియర్ బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక రాజీవ్ స్టేడియంలో శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు జిల్లా స్థాయి బాక్సింగ్ సీనియర్స్ ఎంపికలు జరగనున్నాయని జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు డి.మన్మధరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు బరువు 47-50, 50-55, 55-60, 60-65, 65-70, 70-75, 75-80, 80-85, 85-90 (మొత్తం 10 వెయిట్లు)లో ఎంపికలు ఉంటాయని తెలిపారు. అభ్యర్థులు 1984 జనవరి 1 నుంచి 2005 డిసెంబర్ 31లోపు పుట్టిన వారై ఉండాలని, ఆధార్ కార్డు, పుట్టినతేదీ సర్టిఫికెట్, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, ఫిట్నెస్ సర్టిఫికెట్ తీసుకురావాలని తెలిపారు. వివరాలకు ఫోన్ నెంబరు 9908353698లో సంప్రదించాలని కోరారు.



యూనిట్లు తగ్గినా.. బిల్లు బాదేసింది

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజీ కాస్ట్ అడ్జెస్ట్‌మెంట్ (ఎఫ్‌పిపిపిసిఎ) పేరుతో విధించిన ఛార్జీలు ప్రజలకు భారంగా మారాయి. వైసిపి ప్రభుత్వం తన ఐదేళ్ల పాలనలో ట్రూ అప్, ఎఫ్‌పిపిపిపిసిఎ వంటి రూపాల్లో విధించిన బిల్లుల భారం ఇప్పటికీ కొనసాగుతోంది. తాజాగా టిడిపి ప్రభుత్వం నవంబరు నుంచే ఎఫ్‌పిపిపిసిఎ ఛార్జీలను వసూలు చేయాలని నిర్ణయించడంతో, ఆ భారానికి ఎఫ్‌పిపిపిసిఎ ఛార్జీలు తోడై వినియోగదారులపై మరింత భారం పడింది. వీటికితోడు సర్‌ఛార్జీలు, ఫిక్స్‌డ్, కస్టమర్ ఛార్జీలు ఇలా రకరకాల పేర్లతో విధించిన ఛార్జీలతో వస్తున్న బిల్లులు చూసి వినియోగదారుల గుండె గుభేల్‌మంటోంది.

– ప్రజాశక్తి, విజయనగరంటౌన్

- రెండు రకాల ఇంధన సర్దుబాటు ఛార్జీలతో పెరిగిన భారం
- సర్‌ఛార్జీ, ఫిక్స్‌డ్, కస్టమర్ ఛార్జీలతో బిల్లులు తడిసిమోపెడు



నగరంలో పావనీనగర్‌కు చెందిన మంత్రి ఆదిలక్ష్మి నవంబర్‌లో 97 యూనిట్లు విద్యుత్తును వినియోగించగా బిల్లు రూ.350 వచ్చింది. దీనికి అదనంగా సర్‌ఛార్జీలు రూ.25. ఇడి ఛార్జి రూ.10, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీ రూ, 69, ఎఫ్‌పిపిసిఎ 2 చార్జి 47 రూపాయిలు మొత్తం 561 రూపాయలు బిల్లు వచ్చింది. సబ్సిడీ పోను రూ.493 బిల్లు కట్టాల్సి వచ్చింది. గత నెల అక్టోబర్ బిల్లులో కూడా రూ.25 రూపాయలు సర్‌ఛార్జీ విధించారు. అదనంగా ఈనెల ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలు తోడై బిల్లు అధిక మొత్తంలో రావడంతో ఆమె లబోదిబోమంటున్నారు.

– సిక్కుల కాలనీనికి చెందిన ఇందుకూరి ఇనాస్ (సర్వీసు నెంబర్ 1667) అక్టోబర్ కంటే నవంబర్‌లో తక్కువ యూనిట్లు వినియోగించినప్పటికీ బిల్లు మాత్రం ఎక్కువగా వచ్చింది. ఈ బిల్లును పరిశీలిస్తే సర్‌ఛార్జి రూ.25తో పాటు ఎఫ్‌పిపిపివిసి 2 పేరుతో మరో రూ.130 అదనంగా విధించారు. గత నెల రూ.275 బిల్లు వస్తే నవంబర్ బిల్లు 440 వచ్చింది. విద్యుత్తు తక్కువ వినియోగించినప్పటికీ బిల్లు ఎక్కువ రావడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



– కెఎల్‌పురానికి చెందిన సిహెచ్ వెంకటరావు (సర్వీసు నెంబరు 121103 అర్101000857)కు గతనెల 269 యూనిట్లు విద్యుత్తును వినియోగించగా రూ.1492 బిల్లు వచ్చింది. ఈనెల 255 యూనిట్లు వినియోగించగా ఛార్జీలు తగ్గకపోగా రూ.1651 బిల్లు వచ్చింది. ఇందులో ఎఫ్‌పిపిసిఎ పేరుతో రూ.153.54 రూ, ఎఫ్‌పిపిసిఎ 2 పేరుతో మరో రూ.102 అదనంగా పడింది. ఈనేపథ్యంలో ఆయన బిల్లు పెరిగింది.



గత రెండు నెలల బిల్లుల్లో వ్యత్యాసం

రోడ్డుపైనే చదువుకోవాలా?

డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరుతూ గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా బిల్డింగ్ సదుపాయం లేకపోతే భవిష్యత్తులో మా చదువు ఫుట్‌పాత్‌మీద చదవాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన చెందారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.రమేష్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితంగా 2019లో విజయనగరం పట్టణానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకొచ్చి ందని, కళాశాల ప్రారంభమైనప్పటికీ సొంత బిల్డింగ్ లేకపోవడం దారుణమైన పరిస్థితి అని అన్నారు. సాంస్కృతిక డిగ్రీ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు ఒకే చోట తరగతులు ఉన్నందున పూటకొక కళాశాల చొప్పున నిర్వహించాల్సి వస్తోందన్నారు. కావున డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జి.సూరిబాబు, కె.రాజు, పట్టణ నాయకులు జయ, రాహుల్, సుస్మిత, విద్యార్థులు పాల్గొన్నారు.



డిగ్రీ కళాశాల ఎదుట ఫుట్‌పాత్‌పై చదువుతూ నిరసన తెలుపుతునఉన విద్యార్థులు

14 నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు

ఎపి ఇపిడిసిఎల్ ఎస్ఇ లక్ష్మణరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు జిల్లాలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ మువ్వల లక్ష్మణ రావు తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ వారోత్సవాలలో భాగంగా జిల్లా ప్రధాన కేంద్రం, డివిజన్ కేంద్రాలలో విద్యుత్ పొదుపు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ పొదుపుపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించబడునని పేర్కొన్నారు. స్వయం సహాయక మహిళ సంఘాలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం, ఇంధన సంరక్షణ పద్ధతులు, స్టార్ రేటెడ్ గృహోపకరణాల ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

విద్యుత్ పొదుపు ఆవశ్యకత, నూతన సాంకేతిక విజ్ఞానం అంశాలపై ఇంజినీరింగ్ కళాశాలలో వర్క్ షాపులు నిర్వహిస్తామన్నారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకత గురించి వినియోగదారులతో అన్ని విద్యుత్ కార్యాలయాలలో అవగాహన సదస్సులు, విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించేందుకు గ్రామీణ ప్రాంతాలలో జానపద కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామన్నారు. వివిధ పోటీలలో విజేతలకు వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఈనెల 20న బహుమతులు అందజేస్తామని తెలిపారు.

విద్యార్థి మృతిపై నివేదిక కోరిన ఎస్‌టి కమిషన్ చైర్మన్

ప్రజాశక్తి-విజయనగరం కోట

శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటి విద్యార్థి ప్రవీణ్ నాయక్ మృతి పట్ల రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు విచారం వ్యక్తం చేసారు. విద్యార్థి మతిపై కళాశాల యాజమాన్యం, జిల్లా యంత్రాంగంతో గురువారం ఆయన మాట్లాడారు. కళాశాలలో నెలకొన్న పరిస్థితులు, విద్యార్థుల నడవడికపై యాజమాన్యాలు, నిర్వాహకులు దృష్టి సారించాల్సిన అవసరం వుందన్నారు. అవసరమైన సందర్భంలో కౌన్సిలింగ్ చేపట్టాలని, విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు విద్యా సంస్థలు బాటలు వేయాలని సూచించారు. ప్రవీణ్ నాయక్ మృతికి గల కారణాలపై సమగ్ర నివేదిక అందజేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఈ సందర్భంగా కోరారు. ప్రవీణ్ నాయక్ కుటుంబానికి సంతాపం తెలిపారు.

మేమొచ్చాకే రైతులకు మేలు

టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున, ఎమ్మెల్యే అదితి

ప్రజాశక్తి-విజయనగరంకోట

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రైతులకు మేలు జరిగిందని టిడిపి విజయనగరం పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున, ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికలైన తరువాత ఎప్పుడూ బయట కనిపించని వైసిపి నాయకులు ఇప్పుడు బయటకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. గత ఐదేళ్లలో ధాన్యం కొనుగోలు చేసేందుకు రైతులకు ఎన్నో ఆంక్షలు పెట్టారని, రైతులకు స్వేచ్ఛ లేకుండా దళారీ వ్యవస్థ ద్వారా దోచుకున్నారని విమర్శించారు. రైతులకు కనీస ధర రాకుండా వారు చెప్పిన రేటుకే అమ్ముకోవాల్సిన పరిస్థితి కనిపించిందన్నారు. సకాలంలో ధాన్యం డబ్బులు చెల్లిస్తామని చెప్పి మొన్నటివరకూ చెల్లించలేదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు ధాన్యం విక్రయించిన 24గంటల్లోనే డబ్బులు చెల్లిస్తున్నామని చెప్పారు. రైతులకు మేలు కలిగించే విధానాలను ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న కిమిడి నాగార్జున

ఎండిఎం కార్మికులకు

కనీసం రూ.10 వేలు వేతనమివ్వాలి

- బకాయి బిల్లులు, జీతాలు చెల్లించాలి
- 16న కలెక్టరేట్ వద్ద ధర్నాకు సిఐటియు పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మధ్యాహ్న భోజన పథక కార్మికులకు కనీసం నెలకు రూ.10వేలు గౌరవ వేతనం చెల్లించాలని, బకాయి బిల్లులు వెంటనే ఇవ్వాలని కోరుతూ ఈనెల 16న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ. జగన్మోహన్‌రావు పిలుపునిచ్చారు. గురువారం విజయనగరం అర్బన్, రూరల్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులను కలిసి కరపత్ర ప్రచారం నిర్వహించారు. గాజులరేగ హైస్కూల్లో జరిగిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో నిర్వాహకులు రామలక్ష్మి, పైడ్రాజుతో కలిసి ఆయన మాట్లాడారు. ఆగస్టు నుంచి జీతాలు, బిల్లులు బకాయిలు ఉన్నాయని, తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల నిత్యవసర సరుకుల ధరలు పెరిగినా పిల్లలకు చెల్లించే మెస్ బిల్లులు, కార్మికుల జీతాలు మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పిల్లాడికి ఇచ్చే మెనూ ఛార్జీ కనీసం రూ.20కు పెంచాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, 3 జతల కాటన్ దుస్తులు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని, కూటమి ప్రభుత్వం ఆరు గంటల గ్యారంటీలో భాగంగా ఉచిత గ్యాస్ పథకం వంట ఏజెన్సీలకు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు.



ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు, మధ్యాహ్న భోజన కార్మికులు

19 నుంచి మిరాకిల్‌లో డిజిటల్ సమ్మిట్

ప్రజాశక్తి-భోగాపురం

మిరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఈ నెల 19 నుంచి మూడు రోజులపాటు డిజిటల్ సమ్మిట్-24 నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సిఇఒ లోకం ప్రసాద్ తెలిపారు. ముంజేరు సమీపంలోని మిరాకిల్ సిటీలో గురువారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగే ఈ సమ్మిట్‌కు సుమారు 1500 మంది హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ప్రముఖ కంపెనీలు గూగుల్, టిసిఎస్‌తోపాటు వివిధ సంస్థల నుంచి పెద్దఎత్తున సాఫ్ట్‌వేర్ అనుభవజ్ఞులు హాజరవుతారని తెలిపారు. సాఫ్ట్‌వేర్‌కి సంబంధించిన వివిధ అంశాలపై ప్రసంగిస్తారని చెప్పారు. దీని ద్వారా సుమారు 50 వేల మంది విద్యార్థులను ఉద్యోగులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడించారు. 2016 నుంచి 2019 వరకు క్లౌడ్, ఎఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ టెక్నాలజీ శిక్షణ కోసం కూడా ఇది ఉపయోగ పడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నార్త్ కోస్టల్ ప్రాంతాన్ని ఐటి హబ్‌గా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా ఇది ఐదో కార్యక్రమమని వివరించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యే లోకం మాధవి, ఐటి కార్యదర్శి యువరాజ్, కలెక్టర్ అంబేద్కర్ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి రవి ఇజ్జు తదితరులు పాల్గొన్నారు.



డిజిటల్ సమ్మిట్ లోగోను ఆవిష్కరిస్తున్న మిరాకిల్ సంస్థ సిఇఒ లోకం ప్రసాద్

బైపాస్, కాలువలకు రూ.65 లక్షలు మంజూరు

బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి దాడితల్లి ఆలయ కూడలి వరకు బైపాస్ రోడ్డు బాగు చేసేందుకు రూ.40 లక్షలు, కాలువల నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేస్తున్నట్లు బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు తెలిపారు. బుడా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి దాడితల్లి ఆలయ జంక్షన్ వరకు రోడ్డు పాడైపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి ఇబ్బందులను గుర్తించి ఎమ్మెల్యే బేబినాయన నిధులు కోరడంతో రూ.65 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. బుడా పరిధిలో ఉన్న మున్సిపాలిటీలకు రూ.కోటి వరకు కేటాయించాలని మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ ఆదేశించారని తెలిపారు. బుడా ల్యాండ్ బ్యాంకు ఏర్పాటు చేసి, భూములు సమీకరించి, మౌలిక సౌకర్యాలు కల్పించి, ప్లాట్లు వేసి విక్రయిస్తామని వెల్లడించారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, ఎఎంసి మాజీ చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ సుంకరి సాయిరమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు

అక్రమంగా తొలగించిన

ఆయాను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గజపతినగరం ప్రాజెక్టు పరిధి రామన్నపేట అంగన్‌వాడీ కేంద్రంలో అక్రమంగా తొలగించిన అంగన్వాడీ హెల్పర్ మానాపురం సౌజన్యను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం నాలుగోరోజుకు చేరుకున్నాయి. దీక్షలను అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎం.కృష్ణమ్మ ప్రారంభించారు. దీక్షకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాడి అప్పారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టివి రమణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా తొలగించిన సౌజన్యకు ఉద్యోగం వచ్చేవరకు పోరాటం కొనసాగించాలని అన్నారు. సర్టిఫికెట్లను సమగ్రంగా పరిశీలించిన తర్వాతనే ఉద్యోగం ఇవ్వడం అనేది ఐసిడిఎస్ సంస్థలో జరిగిన ప్రక్రియ అని, రెండేళ్ల పోయిన తర్వాత సర్టిఫికెట్లు తప్పులని చెప్పడం తొలగించడం అధికారులు ఇష్టారాజ్య విధానాలకు తార్కాణమని అన్నారు. అంగన్వాడీలు భవిష్యత్తును తీసివేస్తే ఊరుకునేది లేదని అన్నారు. దీక్షల్లో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనసూయ, గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, జిల్లా కమిటీ సభ్యులు వరలక్ష్మి, సిహెచ్ తులసి, ఆర్.శంకరావతి. పి .జ్యోతి, ఎం.రవణమ్మ, బి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ద్వారం సంస్మరణ సభ

ప్రజాశక్తి-విజయనగరం కోట

పద్మశ్రీ డాక్టర్ ద్వారం వెంకట స్వామి నాయుడు సంస్మరణ సభను గురువారం ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రముఖ వయోలిన్ విధ్వంసులు ఆకాశవాణి ఎ-గ్రేడ్ ఆర్టిస్ట్ ఎం. నీలాద్రి రావు సోలోగా వయోలిన్ వాయించారు, మృదంగ ధ్వంసులు ఆకాశవాణి ఎ- గ్రేడ్ ఆర్టిస్ట్ ఎం. ఏడు కొండలు వాయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కెవివిఎల్ఎన్ శాస్త్రి, సూపరింటెండెంట్ ప్రసాద్ ఇతర అధ్యాపక బృందం విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ద్వారం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నీలాద్రిరావు



సిఐకు ఫిర్యాదు చేస్తున్న చీటీల బాధితులు

చీటీల వ్యాపారిపై కేసు నమోదు

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం గ్రామానికి చెందిన చీటీల వ్యాపారిపై బాధితుల ఫిర్యాదుతో పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. గ్రామంలోని తోట వీధికి చెందిన తిరుమరెడ్డి మురళి చీటీల వ్యాపారం చేశాడు. బాధితులకు రూ.కోట్లలో చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఆత్మహత్య డ్రామా ఆడి గత నెల 20వ తేదీన చివరికి కుటుంబంతో సహా పరారయ్యాడు. దీంతో ఆయన అదృశ్యమైనట్టు మురళి సోదరి పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. గ్రామస్తులు, పోలీసులు వేధిస్తున్నారంటూ హైకోర్టులో పిటిషన్ కూడా వేశాడు. దీంతో చివరికి బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు 68 మంది బాధితులు భోగాపురం సిఐ ప్రభాకర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ సాగిస్తున్నట్లు సిఐ తెలిపారు.

సర్వే వేగవంతం : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ పరిధిలో వివిధ వ్యాపార పారిశ్రామిక రిటైల్ మరియు సేవా రంగము పరిశ్రమల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని కార్యదర్శులకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. గురువారం కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నతరహా మధ్యతరహా పరిశ్రమదారుల వివరాలను సేకరించే నిమిత్తం రాష్ట్రప్రభుత్వం ఎంఎస్ఎంఇ సర్వేను చేపట్టిందన్నారు. నగరంలో చిన్నచిన్న వ్యాపారాల నుండి పరిశ్రమల వరకు సేవారంగంలో గల సెంటర్లు, జిరాక్స్, హోటల్స్ మొదలగు ఎంటర్‌ప్రైజెస్ వరకు మొబైల్ యాప్ ద్వారా సర్వే నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో టిపిఆర్ఒ సింహాచలం, ఎఇ సీతారామమూర్తి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య

సచివాలయంలో కమిషనర్ తనిఖీ

నగరంలోని 17వ నెంబర్ సచివాలయాన్నినగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది నిర్ణీత సమయానికి హాజరయ్యారా లేదా అన్నది గమనించారు. సచివాలయంలో ఉన్న సిబ్బంది పనితీరును మెరుగుపరుచుకుని ప్రజలకు మంచి సేవలు అందించాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతాంశాల అమలులో కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలని చెప్పారు.

రెవెన్యూ సదస్సు

నగరంలోని వేణుగోపాలపురం లో జరిగిన రెవెన్యూ సదస్సులో కమిషనర్ పల్లి నల్లనయ్య, తహశీల్దార్ కూర్మనాధ్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

అసిస్టెంట్ కమిషనర్ పర్యటన

నగరంలోని 17వ డివిజన్‌లో నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు పర్యటించారు. స్థానిక కార్పొరేటర్ ఆశపు సుజాత, కోఆప్షన్ సభ్యుడు ఆశపు వేణు తదితరులు పాల్గొన్నారు. పుత్సలవీధిలో నిర్మాణం జరుగుతున్న భవనాన్ని చూసి అనుమతులన్నీ సక్రమంగా ఉన్నాయా లేదా అని ప్రణాళిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని, మధ్యాహ్నం భోజన పథకం అమలును పరిశీలించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు సీతారామ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన పెంచాలి

విజయనగరం టౌన్ : ప్రజల మాన,ప్రాణాలను పరిరక్షించేందుకు ఏర్పాటు చేసిన మానవ హక్కుల కమిషన్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలని మానవ హక్కుల రాష్ట్ర కార్యకర్త, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పైల రమేష్ రాజు విజ్ఞప్తి చేశారు. గురువారం శ్రీకాకుళంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ ఎస్.విజయభారతిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవ హక్కులపై ప్రజల్లో అవగాహన కొరవడిందని, ప్రచారం నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ఎస్సీ,ఎస్టీలపై జరిగిన దాడులు, అత్యాచారాల నిరోధక చట్టం అమలు తీరు తదితర అంశాలపై వినతిని అందజేసినట్లు తెలిపారు.

19న జాతీయ సఫాయి కర్మచారీ కమిషన్ పర్యటన

విజయనగరం కోట : జాతీయ సఫాయి కర్మచారీ కమిషన్ సభ్యులు డాక్టర్ పిపి వావా ఈనెల 19న జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన 18వ తేదీ రాత్రి జిల్లాకు చేరుకుంటారు. రాత్రి విజయనగరంలో బస చేస్తారు. 19న మధ్యాహ్నం 12 గంటలకు మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3గంటలకు కలెక్టర్, ఎస్‌పి, జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమై, సఫాయి కర్మచారీ కార్మికులకు అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలపై సమీక్షిస్తారు. సాయంత్రం 5గంటలకు యూనియన్ బ్యాంకు రీజనల్, జోనల్ మేనేజర్లతో సమావేశమవుతారు. సాయంత్రం 6.30గంటలకు జిల్లా నుంచి బయలుదేరి వెళ్తారు.

ఎస్‌సి హాస్టళ్లకు రూ.1.20 కోట్లు మంజూరు

ప్రజాశక్తి-బొబ్బిలి

నియోజకవర్గంలో ఉన్న సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం రూ. 1.20 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే బేబినాయన ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ఎస్‌సి వసతిగృహాలను చక్కదిద్దేందుకు కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్లు చెప్పారు. బొబ్బిలి, రామభద్రపురం, తెర్లాం, బాడంగి మండలాల్లో ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్న ఎస్‌సి వసతిగృహాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది జనవరి నెలాఖరికి పనులు పూర్తయ్యేలా చూస్తామని తెలిపారు.


పంట పొలం వద్దనే ధాన్యాన్ని లారీలో లోడు చేస్తున్న కూలీలు

520 టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో 530 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు ఎఒ యశ్వంత్‌కుమార్ తెలిపారు. 11,295 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉందని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోగా రైతుల ఖాతాల్లో నగదు జమవుతున్నట్లు వివరించారు. అవసరమైతే రైతు పంట పొలాల్లో వరినూర్పు వద్దకు వెళ్లి ధాన్యాన్ని సేకరిస్తున్నట్లు వెల్లడించారు. రైతులకు అవసరమైన గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సారిపల్లి రూరల్ ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇఇ పి.త్రినాథరావు తెలిపారు. 33/11 కెవి ఐడిఎ సబ్‌స్టేషన్ ఎలొసి మరమ్మతులు చేపట్టడంతో సారిపల్లి, నీలంరాజుపేట, తారకరామ ప్రాజెక్టు, సారిపల్లి వాటర్ వర్క్స్, కుదిపి, పోలీస్ శిక్షణ కళాశాల ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

15 గ్రామాలకు...

వంగర : ఎంఎస్‌ఆర్‌పురం ఫీడర్ పరిధిలోని శివ్వాం, తలగాం, రుషింగి, రాజులగుమ్మడ, వి.వి.ఆర్‌పేట, మద్దివలస, కొప్పరవలస తదితర 15 గ్రామాల్లో శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎఇ సాంబశివరావు తెలిపారు. చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.


ఆర్థిక సహాయం అందచేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి సహాయం

ప్రజాశక్తి-మెరకముడిదాం

మండలంలోని చెల్లాపురం పంచాయతీ ఫీల్డ్‌అసిస్టెంట్ ఆరిపాక అప్పన్న అనారోగ్యంతో ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో మెరకముడిదాం, రాజాం, రేగిడి మండలాల ఉపాధి హామీ సిబ్బంది రూ.43 వేలను అప్పన్న కుటుంబానికి గురువారం అందించారు. ఈ మొత్తాన్ని జెఇ నరేంద్ర ద్వారా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి రెడ్డి వరం, టెక్నికల్ అసిస్టెంట్ అసిరయ్య, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు అందించాలి

ప్రజాశక్తి-విజయనగరం

ప్రభుత్వ పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లను అందించాలని జిల్లా ఖజానా శాఖ డిడి ఆర్‌ఎస్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఆయా సబ్ ట్రెజరీ కార్యాలయాలు, మీసేవా కేంద్రాలతోపాటు జిల్లా ఖజానా కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్‌లో అందజేయాలని సూచించారు.


వంటగదిలో సరుకులు, కూరగాయలను పరిశీలిస్తున్న ఎంఇఒ

గురుకులాన్ని సందర్శించిన ఎంఇఒ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులాన్ని ఎంఇఒ-2 పి.బాలభాస్కరరావు గురువారం సందర్శించారు. అనంతరం కెజిబివిని పరిశీలించారు. అక్కడ నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలను పర్యవేక్షించారు. అనంతరం వంటగది, స్టోర్‌రూం, విద్యార్థులకు అందిస్తున్న వస్తువులను తనిఖీ చేశారు. అనంతరం ఆయా విద్యాలయాల ఆవరణ, చదువుతున్న గదులను పరిశీలించారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు పాల్గొన్నారు.

17న గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఈనెల 17న గ్రామీణ వైద్యులు ఆత్మీయ సమ్మేళనం రామనారాయణం సమీపంలోని జొన్నవలస రోడ్డు మామిడితోటలో జరగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు చిరంజీవి, కార్యదర్శి కోట్ల పైడిరాజు తెలిపారు. స్థానిక పిఎస్‌ఆర్ కాంప్లెక్సులో గురువారం వారు విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో వున్న ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం సభ్యులందరూ హాజరై కార్యక్రమాలన్నీ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి మక్కువ రమణ, సమాచార కార్యదర్శి కర్రి సత్యం నారాయణ భవానీ, దివాకర్, సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

47 మద్యం బాటిళ్లతో ఒకరు అరెస్టు

ప్రజాశక్తి-వంగర

మండలంలోని నీలయ్య వలసలో అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తున్న నెల్లి గణేష్ నాయుడును అరెస్టు చేసినట్లు హెచ్‌సి నాగేశ్వరరావు తెలిపారు. అతని నుంచి 47 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

భూసమస్యలు పరిష్కరించాలి

రెవెన్యూ సదస్సులో రైతుల వినతులు


భోగాపురం.. భూముల సమస్యలను వివరిస్తున్న రైతు


ప్రజాశక్తి-రేగిడి

ఎన్నో ఏళ్ల నుంచి భూ సమస్యలు ఉన్నాయని, వాటిని తక్షణమే పరిష్కరించేలా చూడాలని వెంకంపేట రైతులు.. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌ను కోరారు. గురువారం మండలంలోని వెంకంపేటలో ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రిజిస్టర్ డాక్యుమెంట్ ఉన్నప్పటికీ మ్యుటేషన్ ప్రక్రియ జాప్యం కారణంగా కొత్త పాస్ పుస్తకాలు ఇవ్వడం లేదని, అడంగల్‌లో పేరు మార్పు చేయాలని డబ్బాడ సరోజనమ్మ వినతినిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కిమిడి అశోక్ కుమార్, తహశీల్దార్ చిన్నారావు, నాయకులు పాలవలస రామచంద్ర నాయుడు, విఆర్‌ఒ పట్టాభి పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సు చక్కని వేదికని ఆర్‌డిఒ సత్యవాణి తెలిపారు. తునివాడలో ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. తమ భూములకు పట్టదారు పాస్ పుస్తకాలు అందజేయాలని ముగ్గురు అర్జీలు చేసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మురళి, విఆర్‌ఒ మధు పాల్గొన్నారు.

భోగాపురం : భూ సమస్యల పరిష్కారం లక్ష్యంగా రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తుందని మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. పోలిపల్లి గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తగరపువలసకు చెందిన శ్రీనివాసరెడ్డి ఆర్మీలో పని చేసిన తన తండ్రికి భూమి ఇచ్చినప్పటికీ ఆ భూమిపై వేరే వ్యక్తులు ఉన్నారని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. మ్యుటేషన్, భూమి ఒక దగ్గర ఉంటే సర్వే నంబర్ మరోచోట ఉన్నటువంటి ఫిర్యాదులు కూడా అందినట్లు తహశీల్దార్ సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, నాయకులు పల్లి సత్యవతి, కర్రోతు శ్రీనివాసరావు, శంకర్, షేక్ మదీనా, విఆర్‌ఒలు, తదితరులు పాల్గొన్నారు.


వేపాడ.. మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి లక్ష్మీనరసింహం


రేగిడి.. ఎమ్మెల్యే మురళీమోహన్‌కు అర్జీలు అందిస్తున్న రైతులు

బొండపల్లి : భూ సమస్యల పరిష్కారానికి రైతులు సహకరించాలని మండల ప్రత్యేకాధికారి సాల్మన్‌రాజు కోరారు. బొండపల్లి సచివాలయ ఆవరణలో గురువారం రెవెన్యూ సదస్సు ఏర్పాటుచేశారు. తహశీల్దార్ డి.రాజేశ్వరరావు మాట్లాడుతూ రైతులు పూర్తిగా సహకరిస్తే భూ వివాదాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు, ఉప సర్పంచ్ కోల వెంకటరమణ, ఆర్‌ఐ హరికృష్ణ, పిహెచ్‌సి మాజీ ఛైర్మన్ మాసారపు పోలినాయుడు, రైతు నాయకులు బుద్ధరాజు సత్యనారాయణ రాజు, బుద్ధరాజు మరళీ రాజు, జంపన రామకృష్ణరాజు, విఆర్‌ఒ కె.ప్రభాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆతవలో 12 అర్జీలు

వేపాడ : మండలంలోని ఆతవ గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 12 అర్జీలు అందాయి. అందులో మ్యుటేషన్లకు అత్యధికంగా 9 అర్జీలు వచ్చాయని, సవరణలకు మూడు దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ జె.రాములమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనరసింహం, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

అదనపు ఎస్‌పి సౌమ్యలత


వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎఎస్‌పి సౌమ్యలత

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పోలీసు సంక్షేమ ఆంగ్ల పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు ఎస్‌పి (పరిపాలన) పి.సౌమ్యలత మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. విద్యార్థుల దంత, కంటి మరియు ఇతర వైద్య సమస్యలను నివారించేందుకు విద్యార్థులకు ఆయా విభాగాల వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించారన్నారు.

ఇతర వైద్య సమస్యలకు అవసరమైన వైద్యం అందించే విధంగా చర్యలు చేపట్టాలని సూచిస్తామని తెలిపారు. 450 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ప్రత్యేకంగా రిపోర్టులను విద్యార్థుల తల్లిదండ్రులకు అంజేయనున్నారు. కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు, రోటరీ ప్రెసిడెంట్ వినోద్ కుమార్, సెక్రటరీ బి.నాగప్రసాద్, సభ్యులు జి.వీరభద్రరావు, జిబివి రాజు, డి.శ్రీరామమూర్తి, వై.మస్తానరావు, జగదీష్, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, ఆర్‌ఐలు ఎన్. గోపాలనాయుడు, శ్రీనివాసరావు, ఆర్.రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

రోడ్లకు మహర్దశ

ఎమ్మెల్యే మురళీమోహన్

ప్రజాశక్తి-రాజాం

కూటమి ప్రభుత్వ హయాంలో రోడ్లకు మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. మండలంలోని విఆర్ అగ్రహారం బ్రిడ్జి వద్ద గుంతలను పూడ్చే పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్లపై గుంతలు పూడ్చేందుకు రూ.4 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో పాలకుల నిర్లక్ష్యంతో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయని చెప్పారు. కనీసం గుంతలు కూడా పుడ్చలేని దయనీయ స్థితికి చేరారని విమర్శించారు. రోడ్ల దుస్థితి జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైందన్నారు. వైసిపి పాలకుల అసమర్థతతో పొరుగు రాష్ట్రాల నేతలు సైతం విమర్శలు గుప్పించే స్థాయికి వెళ్లిందన్నారు. అనంతరం పొగిరి గ్రామంలో శ్రీవెంకట్ రామేశ్వర రైస్ మిల్లును ప్రారంభించారు.

సర్పంచుల శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-గజపతినగరం

సర్పంచుల, కార్యదర్శులు, సచివాలయాల సిబ్బందికి నిర్వహిస్తున్న రెండో విడత శిక్షణ తరగతులను గురువారం ఎంపిడిఒ బి.కళ్యాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా శిక్షణ తరగతులకు హాజరై, కొత్త అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలన్నారు.

శృంగవరపుకోట : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ సర్పంచులు, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి గురువారం శిక్షణ ప్రారంభమైంది. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్య అభియాన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ శిక్షణను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు.


గజపతినగరంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ కళ్యాణి

143 జిఒను రద్దు చేయాలి

టిఎన్‌ఎంహెచ్‌ఇఎ జిల్లా అధ్యక్షులు టిబిఎస్ వర్మ రాజు

ప్రజాశక్తి-విజయనగరం కోట



జనాభా ప్రాతిపదికన సిబ్బంది నియామకం కాకుండా అన్ని పిహెచ్‌సిలకు 14 మంది సిబ్బంది ఉండాలని గత ప్రభుత్వం జారీ చేసిన 143ను జిఒ రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు టిబిఎస్ వర్మ రాజు డిమాండ్ చేశారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ వైద్యఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఎఎన్‌ఎంలు గత కొంతకాలంగా అనేక ఇబ్బందులతో సతమవుతున్నావుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థలో కొంతమందిని ఎఎన్‌ఎం పోస్టుల్లో భర్తీ చేసిందని, అధికారుల అవగాహన రాహిత్యంతో అవసరం కన్నా ఎక్కువ పోస్టులు భర్తీ చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం రీ డిప్లమెంట్ పేరుతో ఒక దగ్గర పని చేసే వారిని తగ్గించి వివిధ ప్రాంతాల్లో సర్దుబాటు చేశారని, దీనివల్ల ఇప్పుడు ఎఎన్‌ఎంలు చాలా మందికి ఉద్యోగం ఒకచోట, జీతం మరోచోట వస్తున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఎఎన్‌ఎంల మధ్య చిచ్చు పెట్టి సచివాలయ ఎఎన్‌ఎం పేరుతో గ్రేడ్-3 పోస్టులు వేశారని, వారిని ఇప్పుడు ప్రభుత్వం గ్రేడ్ 2గా మార్చాలని సచివాలయ ఎఎన్‌ఎంలు కోరుకుంటున్నారని తెలిపారు. సచివాలయ ఎఎన్‌ఎంలకు మెడికల్ హెల్త్ లో కాకుండా ఎం పిడిఒ వ్యవస్థ ద్వారా జీతాలు ఇస్తున్నారని తెలిపారు. 143 జీవోను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

జరజాపుపేటలో పశు వైద్య శిబిరం


లేగదూడల ప్రదర్శనను తిలకిస్తున్న జెడి వైవి రమణ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జరజాపుపేటలో గురువారం జిల్లా పశుగణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని పశు సంవర్ధక శాఖ జెడి వై.వి.రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ శాఖ డిడి దామోదరరావు, ఇఒ రాధాకృష్ణ మాట్లాడుతూ పశువుల యాజమాన్య పద్ధతులపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. 69 ఆవులు, గేదెలకు గర్భకోస వ్యాధులకు చికిత్స అందించారు. లేగ దూడల ప్రదర్శన ఏర్పాటుచేశారు. నట్టల నివారణ, ఖనిజ మిశ్రమాన్ని పంపిణీ చేశారు. శిబిరంలో గరివిడి పశు వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఫణీంద్ర, డాక్టర్ శ్రీలత వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ పాల ఉత్పత్తిదార్ల సంఘం సభ్యులు సుంకర శ్రీనివాసరావు, టి.విజయ్ కుమార్, బోని వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐ శ్రీనివాస్

మత్తు పదార్థాలు హానికరం : సిఐ

ప్రజాశక్తి-విజయనగరం కోట

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగాఉండి తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని వన్ టౌన్ సిఐ ఎస్. శ్రీనివాస్ అన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా అయ్యన్నపేట వద్దగల ఎస్‌కె పిజి కాలేజి కాన్ఫరెన్సు హాల్లో యువతకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. డ్రగ్స్ సేవించడం, డ్రగ్స్‌ను కలిగి ఉండడం, డ్రగ్స్ అమ్మడం వంటి చేయడం వల్ల చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. మాదకద్రవ్యాలు జోలికి వెళ్లకుండా ముందు జాగ్రత్తలు గురించి విద్యార్థులకు వివరించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు డిజిటల్ అరెస్టులు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ప్రసన్న కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారణకు సహకరించాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీలో ప్లాస్టిక్ నివారణకు సహకరించాలని కమిషనర్ కె.అప్పలరాజు ప్రజలకు, వ్యాపారులకు సూచించారు. గురువారం నగర పంచాయతీలో షాపుల వద్ద ప్లాస్టిక్‌పై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో ఐదు కిలోల ప్లాస్టిక్ స్వాధీనం చేసుకొని, రూ.3 వేలు అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచుల్లో అమ్మకాలు చేపడితే కేసులు పెట్టి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అనంతరం ఐదో సచివాలయ పరిధిలో మార్పులు చేసిన భవనాలు, ఆస్తి పన్నులు, డిఒ ట్రేడ్ లైసెన్సులు వసూలు చేస్తున్నది, లేనిది తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.ఉమా భాస్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


తనిఖీలు చేస్తున్న కమిషనర్ అప్పలరాజు

మానసిక వికలాంగులకు చేయూత


ఆర్థిక సాయం అందిస్తున్న జెసి రాజు దంపతులు

ప్రజాశక్తి-బొబ్బిలి

మానసిక వికలాంగులకు కారుణ్య ఫౌండేషన్ ఛైర్మన్ జెసి రాజు చేయూతనిచ్చారు. గురువారం స్థానిక ఆర్‌సిఎం చర్చి వద్ద ఉన్న నిర్మల్ హృదయ్ వికలాంగుల ప్రత్యేక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నిర్మల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు హాజరైన జెసి రాజు, పివిఎ మెర్సీ రాజు దంపతులు వసతుల కల్పనకు, పోషణకు రూ.25 వేలను హెచ్‌ఎం నిర్మలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపి వారిని అందరితో సమానంగా ప్రేమించాలని కోరారు. కార్యక్రమంలో సిస్టర్ సునీత, సిస్టర్ మేరీ విద్యార్థులు పాల్గొన్నారు.